# సాక్షి సూర్యాపేట


బుధవారం । 6 । మార్చి । 2024






**ఉత్సవాలకు శ్రీకారం**

యాదాద్రి శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. - 8లో



**సాగరమాత ఉత్సవాలకు..**

నాగార్జునసాగర్‌లోని కృష్ణానది తీరాన మేరీమాత ఆలయ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. - 8లో



**24 గంటలూ అందుబాటులో..**

గర్భిణుల కోసం ఏర్పాటు చేసిన 102 వాహన సేవలు 24 గంటలూ అందుబాటులో ఉండనున్నాయి. - 8లో

## న్యూస్‌రీల్

### సదరం షెడ్యూల్ విడుదల

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సదరం క్యాంపునకు సంబంధించి మార్చిలో 345 ఆన్ లైన్ బుకింగ్ స్లాట్ల తేదీలు విడుదల చేసినట్లు డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ వెంకట్రావు ఆదేశాల మేరకు ఆన్‌లైన్ బుకింగ్ స్లాట్లు మార్చి 7న మీ సేవ ద్వారా బుక్ చేసుకోవచ్చని సూచించారు. కొత్తగా వికలత్వ పరీక్షల కోసం వచ్చేవారితో పాటు రెన్యువల్ కోసం వచ్చేవారు కూడా మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు. స్లాట్ బుక్ చేసుకున్నవారు సూచించిన ఈనెల 13, 21,27 తేదీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో శారీరక వికలత్వ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత డాక్టర్ల బృందం పరీక్షలు నిర్వహించి వికలత్వ శాతాన్ని నిర్ధారించి సర్టిఫికెట్ ఇస్తారని పేర్కొన్నారు. మీ సేవలో బుకింగ్ చేసుకున్న స్లిప్, ధ్రువీకరణపత్రాలు (ఆధార్ కార్డు, ఫొటో, రేషన్‌కార్డు, ఓటరు ఐడీ కార్డు) తీసుకుని సదరం క్యాంపునకు హాజరు కావాలని సూచించారు.

### త్వరలో 110 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

నడిగూడెం : యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు చేయడానికి సహకార శాఖ ఆధ్వర్యంలో త్వరలో 110 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు డీసీఓ పద్మ వెల్లడించారు. మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాలో 47 సహకార సంఘాలున్నాయని వీటి పరిధిలో ఎరువుల కొరత లేకుండా చూస్తున్నామన్నారు. ఎరువుల కొరత తలెత్తకుండా ఆన్‌లైన్ ద్వారా సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పద్మజ, రైతులు ఉన్నారు.

### నర్సరీల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి



నర్సింహులగూడెంలో నర్సరీని పరిశీలిస్తున్న శిరీష

మునగాల: వేసవి కాలం ప్రారంభమవుతున్నందున నర్సరీల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు డైరెక్టర్ బి.శిరీష సూచించారు. మంగళవారం మునగాల మండలం నర్సింహులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల నర్సరీని ఆమె పరిశీలించి మాట్లాడారు. సంచుల్లో ఇప్పటివరకు మొలకెత్తని విత్తనాలు ఉంటే తిరిగి నాటాలన్నారు. సంచులను ఎప్పటికప్పుడు మట్టితో నింపి ఉంచాలని సూచించారు. వచ్చే వేసవిలో మొక్కలు నాటే సమయానికి నర్సరీని సిద్ధం చేయాలన్నారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో ఇప్పటివరకు నగదు బదిలీ కాని లబ్ధిదారులకు తక్షణమే అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట ఉపాధిహామీ పథకం ఏపీఓ శైలజ, ఈసీ కళ్యాణ్, టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు, ఫీల్డ్‌అసిస్టెంట్ కళ్యాణి , గ్రామపంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

### పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి




పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సి. చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య మంగళవారం ఖమ్మంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల లోపు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యేలా మంత్రి చొరవ చూపాలని కోరారు. పెండింగ్ లో ఉన్న మూడు డీఏలలో కనీసం రెండు డీఏలను తక్షణమే ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు ఎర్నేని రామారావు, సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, హుజూర్‌నగర్ యూనిట్ అధ్యక్షుడు చెన్నా సోమయ్య, ఎంఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులు ఎలా!

## ప్రజాపాలన నూతన దరఖాస్తుల నమోదుకు ఓపెన్ కాని సైట్

- పాత దరఖాస్తుల సవరణకే చాన్స్
- గతంలో దరఖాస్తు చేసుకోని వారికి తప్పని ఇబ్బందులు
- కొత్త వారికి అవకాశం ఇవ్వాలని వినతి



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు తరువాత ప్రజాపాలనలో ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించింది. కొన్ని హామీలను ఇప్పటికే అమలు చేస్తోంది. అర్హులై ఉండి ప్రజాపాలనలో దరఖాస్తులు సమర్పించనివారికి అవకాశం కల్పిస్తామని ఇది నిరంతరం కొనసాగుతుందని ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రజాపాలన కొత్త దరఖాస్తులను స్వీకరించే పోర్టల్‌లు చాలా రోజుల నుంచి మూసివేశారు. కేవలం పాత దరఖాస్తుల్లో సవరణలు మాత్రమే చేసేలా వెబ్‌సైట్ పని చేస్తోంది. దీంతో దరఖాస్తుదారులకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలలో అనేక సందేహాలు కలుగుతున్నాయి. అర్హులు ఎంతమంది ఉన్నా పథకాన్ని వర్తింపజేస్తామని సంబంధిత శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నా... కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికే వీలు లేకుండా పోయింది.

**కార్యాలయాల్లో అందజేత**

గృహజ్యోతి పథకం కింద ఆహారభద్రత కార్డులు ఉన్న వారందరికీ నెలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. రూ. 500లకే గ్యాస్ సరఫరా చేయనున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి జీరో బిల్లులు కూడా ఇస్తున్నారు. అదే విధంగా సబ్సిడీ గ్యాస్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పథకాలకు అర్హులు ఎవరైనా ఉంటే ఆయా ఎంపీడీఓ, మున్సిపాలిటీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. చాలా మంది అర్హులు దరఖాస్తు చేయడానికి ఎంపీడీఓ, మున్సిపాలిటీలకు వెళ్తున్నారు. అక్కడి ఇన్‌వార్డుల్లో దరఖాస్తులు అందజేస్తున్నారు. అయితే కొత్త దరఖాస్తులను స్వీకరించినా ఆన్‌లైన్‌లో నమోదుకు సైట్ మాత్రం పనిచేయడం లేదు. దీంతో లాగిన్ ఇచ్చిన తర్వాత మీ వివరాలను అప్లోడ్ చేస్తామని సిబ్బంది చెబుతున్నారు.

**అద్దెకు ఉంటున్న కుటుంబాలకు ఇబ్బంది**

ప్రభుత్వం అద్దెకు నివసిస్తున్న వారికి కూడా నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించిన విషయం విదితమే. అయితే పట్టణాల్లో అద్దెకు ఉంటున్న వారు గతంలో దరఖాస్తులు చేసుకోలేక పోయారు. దీంతో వీరు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపాలిటీల్లో దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు సూచించారు. దీంతో అర్హులు మళ్లీ దరఖాస్తులు చేస్తున్నారు. ఇలాంటి వారి వివరాలను నమోదు చేయాలంటే వెబ్‌సైట్ మూసి వేసి ఉంది. అది ఓపెన్‌కావడంలేదు. అలాంటప్పుడు వీరికి లబ్ధి పొందే అవకాశం ఉండదు. సైట్ తెరిచి దరఖాస్తుదారుల వివరాలను అందులో నమోదు చేసిన తర్వాతే పథకం వర్తిస్తుందని అధికారులు అంటున్నారు.

**కొనసాగుతున్న దరఖాస్తుల సవరణ**

జిల్లాలోని 23 మండలాలు, 5 మున్సిపాలిటీల్లో ప్రజాపాలన దరఖాస్తుల సవరణ ప్రక్రియ కొనసాగుతోంది. మండలాల్లో ఎంపీడీఓ కార్యాలయల్లో ఈ - పంచాయతీ ఆపరేటర్లు, మున్సిపాలిటీల్లో కంప్యూటర్ ఆపరేటర్లు ప్రజాపాలనలో అందిన దరఖాస్తులపై వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ పరిష్కరిస్తున్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 9 వరకు కొనసాగనుంది. అయితే ప్రభుత్వం ఇది నిరంతర ప్రక్రియ అని చెబుతోంది. అదే విధంగా గతంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేని వారు ఇప్పుడు మండల, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. కానీ ఈ దరఖాస్తుల నమోదుకు సైట్ ఓపెన్ కావడంలేదు.

**నా దృష్టికి రాలేదు**



కొత్త దరఖాస్తులను ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా స్వీకరిస్తున్నాం. కానీ ప్రస్తుతం వీటి వివరాలు నమోదు చేయాలంటే వెబ్ సైట్ ఓపెన్ కావడంలేదన్న విషయం నాదృష్టికి రాలేదు. ప్రజాపాలన కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను మండలాలు, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాల ద్వారా పరిశీలన వేగవంతం చేయాలి. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల కోసం లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులకు అధిక ప్రాధాన్యమివ్వాలి. – వెంకట్రావు, కలెక్టర్

## అర్వపల్లిలో కనులపండువగా పారువేట



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, ఆలయ పాలక వర్గ ప్రతినిధులు తదితరులు

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న కొమ్ము కోయ, ఒగ్గుడోలు నృత్య ప్రదర్శనలు

అర్వపల్లి: అర్వపల్లిలోని శ్రీ యోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పారువేట వేడుకను మంగళవారం సాయంత్రం కనులపండువగా నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ప్రాంతానికి చెందిన ఆదివాసి కళాకారులచే గుస్సాడి నృత్యాలు, వరంగల్ జిల్లాకు చెందిన కళాకారులచే ఒగ్గుడోళ్ల ప్రదర్శన నిర్వహించారు. నర్సింహస్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మిల వేషధారణలో కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. స్వామివారు అశ్వవాహనంపై ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరం వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ వేట ముగించుకొని తిరిగి రాత్రికి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ఇంటింటికీ హారతులిచ్చి పూజలు చేశారు. పారువేట కార్యక్రమాన్ని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్, సామ అభిషేక్‌రెడ్డి, ఈఓ వై.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. అవిలయ్య, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, యోగానంద్, పవన్‌కుమార్, ధర్మకర్తలు ఆర్.లక్ష్మజీ, జె.సోమయ్య, డి.కృష్ణమూర్తి, శేఖర్, రేణుక, నాయకులు బైరబోయిన మహరాజు, బ్రహ్మచారి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఉప్పలయ్య, లాలు, పీఈటీ రవి పాల్గొన్నారు.



మహబూబాబాద్ జిల్లాకు చెందిన కళాకారులచే ఒగ్గుడోళ్ల ప్రదర్శన





కేసముద్రం ప్రాంతానికి చెందిన కొమ్ము కోయ కళాకారుల ప్రదర్శన

## నడిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌గా రామారావు

నడిగూడెం : నడిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌గా శ్రీరంగాపురం గ్రామానికి చెందిన కొల్లు రామారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహకార సంఘం కార్యాలయంలో మంగళవారం డీసీఓ యస్.పద్మ సమక్షంలో పాలకవర్గం సమావేశం నిర్వహించారు. సంఘంలో మొత్తం 13 మంది సభ్యులుండగా వారిలో 11 మంది హాజరుకాగా చైర్మన్ పదవికి రామారావు ఒక్కడే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో రామారావును చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయనకు డీసీఓ ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఇదిలా ఉండగా అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో గత చైర్మన్ పుట్ట రమేష్‌పై సభ్యులు గత నెల 29న పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో వైస్‌చైర్మన్ రాములును ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నియమించిన విషయం విదితమే. చైర్మన్ ఎన్నిక కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పద్మజ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం రామారావుకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను, ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, నాయకులు దేవబత్తిని రమేష్ ప్రసాద్, వల్లపురెడ్డి సురేందర్‌రెడ్డి, రామిని విజయ్‌వర్ధన్‌రెడ్డి, పందిరి వెంకటరెడ్డి, పల్లా యుగేందర్‌రెడ్డి, గడ్డం మల్లేష్, బాణాల నాగరాజు, శెట్టి సతీష్, మొక్క భిక్షపతి, వట్టికూటి లక్ష్మీనారాయణ శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానం చేశారు.



నడిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన రామారావుకు ధ్రువీకరణ పత్రం ఇస్తున్న డీసీఓ

## లోకాయుక్త ఆదేశాలు అమలు చేయడంలేదని ఫిర్యాదు

కోదాడ: కోదాడ పెద్దమజీద్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను బహిరంగ వేలం ద్వారా కేటాయించాలని లోకాయుక్త ఆదేశాలు జారీ చేసినా అధికారులు అమలు చేయడంలేదని స్థానికుడు సయ్యద్ బషీరుద్దీన్ మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. లోకాయుక్త తీర్పు అమలు చేయకపోవడం వల్ల సామాన్య వ్యాపారులు దుకాణాలు దొరకక ఇబ్బంది పడతున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. అదే సమయంలో కొందరు అనేక సంవత్సరాలుగా దుకాణాల్లో తిష్టవేసి నామమాత్రపు అద్దెలు చెల్లిస్తూ వక్ఫ్‌బోర్డు ఆదాయానికి గండి కొడుతున్నారని ఆయన ఆరోపించాడు. లోకాయుక్త ఆదేశాలు అమలు చేయడంలో విఫలమైన తెలంగాణ వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, తెలంగాణ వక్ఫ్‌బోర్డు చైర్మన్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, కోదాడ పెద్దమజీద్ అధ్యక్షుడు, కమిటీలపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు.

## క్రైస్తవులకు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి

నల్లగొండ : ఉమ్మడి జిల్లాలోని క్రైస్తవులకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఏఐసీఎఫ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రేఖల భద్రాద్రి కోరారు. మంగళవారం కలెక్టరేట్ సమీపంలో గల చర్చిలో పాస్టర్లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్టియన్లకు రాష్ట్రంలో ఎమ్మెల్సీ, రాజ్యసభ, రెండు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఇస్తామని చెప్పిన హామీ అమలు చేయాలని కోరారు. భద్రాద్రికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ ఇవ్వాలని కోరుతూ పాస్టర్లంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో కట్ట మోసయ్య, జాన్‌బాబు, మధుసూదన్, శేషయ్య, కె.యోవెల్, సామెల్, రమేష్, మిషక్, శ్రీహరి పాల్గొన్నారు.

## వ్యాసరచనతో మేధోశక్తి అధికం

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : విద్యార్థులకు వ్యాసరచన పోటీలతో మేధోశక్తి అధికమవుతుందని కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు. జిల్లాలో ఆర్‌బీఐ లిట్రసీ వీక్ నిర్వహణలో భాగంగా వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతులు పొందిన ఆత్మకూర్(ఎస్) జెడ్పీహెచ్‌ఎస్ 10 వ తరగతి విద్యార్థిని మౌనిక, ఇమాంపేట తెలంగాణ మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థులు శ్రీహర్షిత, శ్రీధర్‌లకు మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రూ. 2వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం బాపూజీ, డీఈఓ అశోక్, ప్రిన్సిపాల్ శంకర్ నాయక్, హెచ్‌ఎం శంకర్, ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ జనార్దన్ పాల్గొన్నారు.

**వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్**

జిల్లాలో త్వరలో నిర్వహించనున్న లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో 80 సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కల్పించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం గతంలో 80 ఏళ్ల వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పించిందని ఇప్పుడు ఎన్నికల నిబంధన 27 –ఏ క్లాజ్ (ఇ)ని సవరించి ఫామ్ 12 డీ ద్వారా 86 ఏళ్లు పై బడిన వారికి అవకాశం ఇచ్చినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన వృద్ధులు హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకోవచ్చని సూచించారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ వెంకట్రావు

## జాతరను విజయవంతం చేయాలి



మేళ్లచెరువు ఆలయం వద్ద పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

- అదనపు కలెక్టర్ లత

మేళ్లచెరువు : ఈనెల 8 నుంచి 12 వరకు మేళ్లచెరువులో నిర్వహించే మహాశివరాత్రి జాతరను విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత కోరారు. మేళ్లచెరువు శివాలయంలో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా నిర్వహించే మహాశివరాత్రి జాతరకు సంబంధించి ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖలకు అప్పగించిన పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని, ఆలయ పరిసర ప్రాంతంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, కరెంట్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. వైద్య సిబ్బంది దిని 24 గంటలు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. భక్తుల క్యూలైన్, వీఐపీల పార్కింగ్ స్థలం, బారికేడ్లు, ఎద్దుల పందేల పోటీల స్థలం, కబడ్డీ పోటీలు నిర్వహించే ప్రాంతాలను అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. ఆమె వెంట దేవాలయ చైర్మన్ శంభిరెడ్డి, ఈఓ కొండారెడ్డి, డీపీఓ సురేష్‌కుమార్, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఎల్పీఓ యాదగిరి, పీఆర్ డీఈ వెంకటయ్య, ఆర్‌అండ్‌బీ ఏఈ పవన్, సీఐ రజితరెడ్డి, ఎస్ఐ పరమేష్ ఉన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావు

**ప్రశాంతంగా జాతర జరుపుకోవాలి : అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావు**

మేళ్లచెరువు జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావు సూచించారు. మేళ్లచెరువు శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవాలయం వద్ద ఈనెల 8 నుంచి 12 వరకు జరిగే మహాశివరాత్రి జాతర సందర్భంగా చేపట్టే కార్యక్రమాలపై స్థానిక పోలీస్ స్టేషలో ప్రభల కమిటీ నిర్వాహకులతో సమీక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, లైటింగ్ ప్రభలు, క్రీడలు, ఎడ్ల పందేలు వంటి కార్యక్రమాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వీఐపీలు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కోదాడ రూరల్ సీఐ రజితరెడ్డి, ఎస్ఐ పరమేష్, నాయకులు శంకర్‌రెడ్డి, సైదేశ్వరరావు, గోవిందరెడ్డి, కొండారెడ్డి, జనిగ సైదులు, శంకర్, అబ్బాస్ పాల్గొన్నారు.

## కేజీబీవీలకు రూ.1.82కోట్లు

- నిర్వహణ, డైట్ చార్జీలు మంజూరు
- గెస్ట్ ఫ్యాకల్టీలకు మరో రూ. 1.04 లక్షలు
- త్వరలో విద్యాలయాల ఖాతాల్లో జమ చేయనున్న అధికారులు

హుజూర్‌నగర్ : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల నిర్వహణకు నిధులు మంజూరు కాకపోవడంతో సమస్యలు అలానే ఉండిపోతున్నాయి. అంతే కాకుండా సరైన సమయంలో బిల్లులు రాక పలు కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో కాంట్రాక్టర్లు విద్యార్థులకు వారానికోసారి ఇచ్చే మాంసాహారం, గుడ్లు అందించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా విద్యార్థినులు పోషకాహారానికి దూరం అయ్యే పరిస్థితి నెలకొంది. జిల్లాలోని చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉంది. నిర్వహణకు నిధులు రాక పోవడంతో సమస్యలు జటిలంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నాలుగు నెలలకు సంబంధించిన ఆయా పెండింగ్ నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నిర్వహణలో అదనపు భారం తపిందని ఆయా విద్యాలయాల నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



హుజూర్‌నగర్ : కేజీబీవీలో వ్యక్తిత్వ వికాస తరగతుల్లో విద్యార్థినులు

**28 విద్యాలయాలకు సంబంధించి..**

జిల్లాలో 28 కేజీబీవీలకు సంబంధించిన నిర్వహణ నిధులు మంజూరయ్యాయి. వాటిలో కేజీబీవీలు 18 ఉండగా, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ 1, మోడల్ స్కూళ్లు 9 ఉన్నాయి. వాటిలో 6 నుంచి 12 తరగతుల వరకు మొత్తం 5,457 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థుల హాజరు ఆధారంగా ప్రస్తుతం డైట్, నిర్వహణ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది.

**ఒక్కో విద్యార్థికి నెలకు పోషకాహారానికి రూ.1,225 చొప్పున..**

ఒక్కో విద్యార్థికి నెలకు పోషకాహారానికి రూ. 1,225, ఒక్కో పాఠశాలకు విద్యుత్, తాగునీటి కోసం రూ.10 వేలు, మరుగుదొడ్లు, స్నానపుగదుల నిర్వహణకు రూ. 1,000, ఇంటర్‌నెట్, పత్రికల కోసం రూ.1,000, వైద్య సేవలు, ల్యాబ్, స్టేషనరీ సామగ్రి కొనుగోలుకు రూ.10 వేలు అవసరం అవుతాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల హాజరు ఆధారంగా ప్రస్తుతం డైట్, నిర్వహణ నిధులను ప్రభుత్వం సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు సంబంధించి జిల్లాకు రూ. 1.82 కోట్లు మంజూరు చేసింది. దీంతో పాటు గెస్ట్ ఫ్యాకల్టీ విధులు నిర్వహిస్తున్న వారికి సైతం ఏప్రిల్ మాసానికి సంబంధించిన వేతనాలు రూ. 1.04 లక్షలు విడుదల అయ్యాయి. దీంతో కేజీబీవీల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఖాతాల్లో జమ చేస్తాం**



జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాలకు సంబంధించిన నిధులు రూ. 1.82 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిని కేజీబీవీల ఖాతాల్లో జమ చేస్తాం. ఆయా విద్యాలయాల నుంచి సంబంధిత కాంట్రాక్టర్లు, సప్లయర్స్‌కు, గెస్ట్ టీచర్లకు వాటిని అందజేస్తాం.

–అశోక్, జిల్లా విద్యాధికారి, సూర్యాపేట

## క్లుప్తంగా

### తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కట్టంగూర్: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కట్టంగూర్ మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు పొడిచేటి పాపులు రోజు మాదిరిగా గ్రామ శివారులో కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా కాలు జారి పక్కనే ఉన్న చెట్టుపై పడిపోయాడు. దీంతో చెట్టు కర్ర విరిగి అతడి తొడలోకి చొచ్చుకెళ్లింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

### తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

ఆత్మకూరు(ఎం): తేనెటీగలు దాడిలో పలువురు గాయపడ్డారు. వివరాలు.. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన గౌడ కులస్తులు మంగళవారం స్థానిక బీరప్ప దేవాలయం వద్ద అగర్‌బత్తీలు అంటించడంతో పొగకు ఒక్కసారిగా చెట్టుపై ఉన్న తేనెటీగలు దాడి చేశాయి. దీంతో గ్రామానికి చెందిన పొనగాని కృష్ణమూర్తి, వెంకన్న, చెర్కు మల్లేశం, ఎర్కల శ్రీధర్‌తో పాటు మరి కొందరు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

### దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

భువనగిరి క్రైం: భూతగాదాలో వ్యక్తిని గాయపరిచిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. మండలంలోని తుక్కాపురం గ్రామానికి చెందిన జల్ల సత్తయ్య, మహేష్ తమ భూమి నుంచి బాట లేదంటూ మంగళవారం తమ బంధువైన శ్రీశైలంపై దాడి చేయడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీశైలంను చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీశైలం భార్య మల్లిక ఫిర్యాదు మేరకు సత్తయ్య, మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

### ఎంజీయూలో టీఎంసీ పార్టీ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నేతలు

నల్లగొండ రూరల్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని గిరిజన తెగ ప్రజలపై దాడి చేసిన నిందితులను ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. టీఎంసీ పార్టీ నాయకులు షాజహాన్ షేక్, అతడి అనుచరులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని గిరిజన తెగ ప్రజలపైన దాడులు, భూ కబ్జాలు, మహిళలపై లైంగిక దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నవీన్‌కుమార్, జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్‌కుమార్ అన్నారు. సీఎం మమతా బెనర్జీ ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు దయాకర్, అభినవ్, మురళి, వంశీ, కార్తీక్, మృణాళి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# సాగరమాత మహోత్సవాలకు ముస్తాబు

- 7 నుంచి 9వ తేదీ వరకు వేడుకల నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


విద్యుత్ వెలుగులతో ముస్తాబైన సాగరమాత దేవాలయం

నాగార్జునసాగర్ : సాగర్‌లోని కృష్ణానది ఒడ్డున వెలిసిన మేరీమాత (సాగరమాత) పేరుతో ఉన్న ఆలయ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఆలయం సర్వమతాల సంగమంగా, ఆధ్యాత్మిక భావనకు ప్రతీకగా వెలుగొందుతుంది. ఈ మహోత్సవాలను ఈనెల7, 8, 9తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగరమాత ఆలయం రాష్ట్రంలోనే విశిష్టత కలిగినదిగా పేరుంది. భక్తులు కోర్కెలు తీర్చే సాగరమాత ఆలయానికి నిత్యం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది క్రైస్తవులతో పాటు అన్ని మతాల వారు తరలివస్తుంటారు. దేశంలోనే భారతీయ సంప్రదాయ రీతుల్లో నిర్మించిన తొలి క్రైస్తవ మందిరంగా ఇది పేరుగాంచింది. ధూప, దీప, నైవేద్యాలు, తలనీలాలు సమర్పించడం వంటి మొక్కులు చెల్లించుకొనే కార్యక్రమాలన్నీ పూర్తిగా హిందూ పద్ధతిలో జరిగే క్రైస్తవ ఆలయం ఇది. ఈ మందిరానికి 1977అక్టోబర్ 10న అప్పటి గుంటూరు మండల పీఠాధిపతి కాగితపు మరియదాసు ప్రారంభించారు. 2011 మార్చి 6న కృష్ణానదీ తీరంలో నిర్మించిన జపమాల క్షేత్రాన్ని గుంటూరు పీఠాధిపతులు గాలిబాలి ప్రారంభోత్సవం చేశారు. ఏసు క్రీస్తు జననం నుంచి మరణం వరకు ఆయన జీవిత చరిత్ర గురించి ఏర్పాటు చేసిన 20జపమాల స్థలాలు, ధ్యాన మందిరం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో 7నుంచి 9వతేదీ వరకు సాగర్‌మాత పుణ్యక్షేత్రంలో దివ్యసత్ప్రసాద నిత్య ఆరాధనలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. 7న ఉదయం 5.30గంటలకు సాగర్‌మాత విచారణ గురువులు గురుశ్రీ పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ రెక్టర్‌చే దివ్య బలిపూజ, 6.30గంటలకు గురుశ్రీ తంబిఅన్నెంచే పూజలు, 10గంటలకు భక్తులకు ఆహ్వానము, జపమాల, ఒంటిగంటకు అన్నదానం, 2గంటలకు వాక్యపరిచర్య, స్వస్థతా ప్రార్థనలు, సాయంత్రం 5.30గంటలకు గురుశ్రీ అల్లం చినశౌరెడ్డిచే పూజాకార్యక్రమాలు, రాత్రి 7.30 గంటలకు కొవ్వొత్తులతో తేరు ప్రదక్షణ రాత్రి 8గంటలకు సాగర్‌మాత కళాకారుల బృందంచే 'సంసోను–డెలీల'బుర్రకథ నిర్వహించనున్నారు. రాత్రి 9గంటలకు రక్తబలి బైబిల్ నాటకం ఉంటుంది. ఇదే తరహాలో 8, 9తేదీల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


సాగరమాత దేవాలయంలో ఉన్న జపమాల క్షేత్రం

# యాదాద్రిలో మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం


త్రిశూలాన్ని పూజించేందుకు తీసుకొస్తున్న అర్చకులు, ఈఓ, అనువంశిక ధర్మకర్త, అధికారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఆచార్యులు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఉదయం 10.30గంటలకు శివాలయంలో నిత్య పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ ధ్వజ స్తంభం, మహా నందీశ్వరుడి విగ్రహం ముందు స్వస్తి వాచనం వేడుకలను జరిపించారు. అనంతరం విష్వక్సేన పూజలను నిర్వహించారు. ఆ తర్వాత పూజా ద్రవ్యములతో ఆలయ పరిసర ప్రాంతాలను సంప్రోక్షణ గావించి శుద్ధి పుణ్యాహవాచన కైంకర్యాన్ని చేపట్టారు. కంకణధారణ (రక్షాబంధనం) కార్యక్రమాన్ని జరిపించారు. ఉత్సవ నిర్వాహకులకు, యాజ్ఞికులకు, ఆలయ అర్చకులకు, అధికారులకు సైతం కంకణధారణ చేశారు. సాయంత్రం సమయంలో పారాయణీకులచే సమక, చమక పారాయణములు, మంత్రపుష్ప పఠనములు, అంకురారోపణము, సోమకుంభ కలశస్థాపన, దేవతారాధన వంటి పూజలు జరిపించి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆయా వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, ఆలయ సిద్ధాంతి, యజ్ఞ బ్రహ్మ, ఆలయ ప్రధానార్చకులు, పారాయణీకులు, పురోహితులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మిర్యాలగూడ రూరల్ ఎస్ఐపై వేటు

- ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు


సతీష్‌వర్మ, ఎస్ఐ

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ సతీష్‌వర్మను నల్లగొండ ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ మంగళవారం ఎస్పీ చందనాదీప్తి ఉత్తర్వులు జారీచేశారు. సూర్యాపేటలో వీఆర్‌లో ఉన్న సతీష్‌వర్మ జనవరి 28వ తేదీన బదిలీపై మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లా సరిహద్దు అయిన ఆలగడప గ్రామ పంచాయతీ పరిధిలోని మూసీ నదిలో సూర్యాపేట జిల్లాలోని నేరేడుచర్ల, పాలకీడు మండలాలకు చెందిన మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడమే ఈ వేటుకు కారణమై ఉండవచ్చనే చర్చ జరుగుతోంది. కాగా ఎస్ఐ ఇసుక అక్రమ రవాణాకు కొమ్ముకాస్తున్నాడనే ప్రచారం కూడా ఉంది. అంతేకాకుండా మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం వద్ద ఇటీవల వాహనంలో తరలిస్తున్న బియ్యాన్ని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ అధికారులు పట్టుబడిన బియ్య పీడీఎస్ బియ్యం కావని నిర్ధారించినప్పటికీ తన వాహనాన్ని ఇవ్వకుండా ఎస్ఐ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడనే మనస్తాపంతో వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడంతో ఎస్ఐ సతీష్‌వర్మను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారనే ప్రచారం జరుగుతోంది.

# ట్రాక్టర్ దొంగిలించిన వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నర్సింహులు

దేవరకొండ: ట్రాక్టర్ దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. ఈ కేసు వివరాలను మంగళవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండల పరిధిలోని మడమడకకు చెందిన రైతు మేడబోయిన అంజయ్య దేవరకొండలో నివాసముంటున్నాడు. తన వ్యవసాయ ట్రాక్టర్‌ను స్థానిక మర్కెట్ యార్డులో నిలిపి ఉంచేవాడు. గత నెల 18న ట్రాక్టర్ చోరీకి గురైందని గుర్తించిన ఆయన దేవరకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా చోరీకి గురైన ట్రాక్టర్ హాలియా సమీపంలో ఉందన్న సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు ట్రాక్టర్‌ను చోరీ చేసిన మైనంపల్లి గ్రామానికి చెందిన పులిజాల గణేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో సిబ్బంది తిరుపతయ్య, సింహాద్రి, రాజారాం తదితరులున్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హుజూర్‌నగర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. హుజూర్‌నగర్‌లో ఏఎస్ఐ లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు వద్ద పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా.. పంగ శ్రీను అనే వ్యక్తి అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి వద్ద మూసీ వాగు నుంచి హుజూర్‌నగర్ పట్టణానికి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## డీసీఎం బోల్తా.. 30క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం


బోల్తాపడిన డీసీఎం

సూర్యాపేట క్రైం: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ పార్క్ వద్ద మంగళవారం పీడీఎస్ బియ్యం తరలిస్తున్న డీసీఎం అదుపుతప్పి బోల్తా పడింది. కోదాడకు చెందిన సంజీవ కోదాడ నుంచి హైదరాబాద్‌కు పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పోలీసులు స్వాధీనం చేసుకొని డీటీసీఎస్ అధికారులకు అప్పగించారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

# నిజాయితీ చాటుకున్న 108 సిబ్బంది


డబ్బులు, ఫోన్‌ను నర్సింగ్ కుటుంబ సభ్యులకు అందజేస్తున్న 108 సిబ్బంది

భువనగిరి క్రైం: మండలంలోని వడాయిగూడెం సమీపంలో మంగళవారం హైదరాబాద్‌లోని గోల్నాకకు చెందిన నర్సింగ్ అపస్మారకస్థితిలో పడిపోగా స్థానికులు గుర్తించి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వెంటనే 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని నర్సింగ్‌ను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా నర్సింగ్ యాదాద్రీశుడిని దర్శనం చేసుకుని వడాయిగూడెంలోని సురేంద్రపురికి వచ్చి సమీపంలో పడిపోయాడు. కాగా అతని దగ్గర రూ.6,900 నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను 108 వాహనం ఈఎంటీ రవికుమార్, పైలెట్ సాగర్ తీసుకుని నర్సింగ్ కుటుంబ సభ్యులకు అందించారు. వారిని పలువురు అభినందించారు. ప్రస్తుతం నర్సింగ్ ఆరోగ్యం నిలకడగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

# టీజీటీగా ఎంపికైన మాజీ సర్పంచ్


కుకునూరి జ్యోతి

అడ్డగూడూరు: మండల పరిధిలోని కంచనపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుకునూరి జ్యోతి టీజీటీ(తెలుగు)గా ఎంపికైంది. కంచనపల్లి సర్పంచ్‌గా ఉన్న ఆమె 2023 ఆగస్టులో కస్తూర్బా గాంధీ జూనియర్ కాలేజ్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించడంతో తన పదవికి రాజీనామా చేసింది. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో టీజీటీ (తెలుగు) ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా జ్యోతిని గ్రామస్తులు అభినందించారు.

**కొరటికల్ వాసికి మూడు ఉద్యోగాలు..**


అంజనేయులు

ఆత్మకూరు(ఎం): మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన జోగు అంజనేయులు గురుకుల జూనియర్ లెక్చరర్‌గా, టీజీటీ, పీజీటీ ఉద్యోగాలకు అర్హత సాధించాడు. ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జూనియర్ లెక్చరర్ నియామక పత్రం అందుకున్నాడు. అంజనేయులు ఆత్మకూరు(ఎం) జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి, ఉన్నత చదువులను భువనగిరిలో పూర్తి చేశాడు. జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఓపెన్ కేటగిరిలో 58వ ర్యాంక్ సాధించాడు.

**టీజీటీలో రాష్ట్రస్థాయిలో 59వ ర్యాంకు..**


జె. కృష్ణవేణి

మోత్కూరు: మోత్కూరు కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు జె. కృష్ణవేణి ఇటీవల ప్రకటించిన టీజీటీ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 59వ ర్యాంకు సాధించింది. కృష్ణవేణి స్వగ్రామం నార్కట్‌పల్లి మండలం తొండల్‌వాయి గ్రామం. కృష్ణవేణిని కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారి యాదమ్మ, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

## పీడీఎస్ బియ్యం తరలిస్తున్న నిందితుల అరెస్ట్

- 75 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

నల్లగొండ క్రైం: పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద 75 క్వింటాళ్ల బియ్యం, బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ నాంపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది నాంపల్లి మండలం మేళ్లవాయి గ్రామ సమీపంలో మల్లికార్జున రైస్‌మిల్లులో తనిఖీ చేశారు. అక్కడ ట్రాలీ ఆటో, బొలేరో వాహనంలో 75 క్వింటాళ్ల బియ్యాన్ని లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉంచగా విచారించి మిల్లు యజమాని వీరమల్ల మల్లికార్జున్, వీరమల్ల రమేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. రేషన్ షాపుల్లో బియ్యాన్ని సేకరించి నాగర్‌కర్నూల్‌లో ఉన్న కోళ్ల ఫారాలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లు ఎడ్ల తిరుపతయ్య, నాయిని సంపతయ్యను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

# హరితహారం మొక్కలు దగ్ధం


చీకటిమామిడి సమీపంలో దగ్ధమైన మొక్కలు


గుండాల: కాలిపోయిన మొక్కలు

మునుగోడు: మండల పరిధిలోని మునుగోడు–చౌటుప్పల్ ప్రధాన రహదారి పక్కన చీకటిమామిడి గ్రామ శివారులోని రోడ్డు వెంట హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమయ్యాయి. రోడ్డు పక్కనే భూమి కలిగిన ఓ రైతు తమ పొలంలోని ఎండుగడ్డికి నిప్పు అంటించడంతో ఆ మంటలు వ్యాపించి రోడ్డు వెంట అర కిలోమీటరు వరకు దాదాపు 30మొక్కలకు పైగా అంటుకోవడంతో కాలి బూడిదయ్యాయి. అదే విధంగా రోడ్డు వెంట ఉన్న విద్యుత్ వైర్లు సైతం కాలి తెగి కిందపడిపోయాయి. ఇప్పటికైనా రోడ్డు వెంట నాటిన మొక్కలను కాపాడేందుకు అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

**బృహత్ పల్లె ప్రకృతి వనంలో మొక్కలు దగ్ధం**

గుండాల: మండలంలోని సీతారాంపురం గ్రామంలోని బృహత్ పల్లె ప్రకృతి వనంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు వేయడంతో మంటలు చెలరేగి సుమారు రెండు ఎకరాలలో నాటిన మొక్కలు పూర్తిగా కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. మంటలను గమనించిన గ్రామ పంచాయతీ సిబ్బంది అప్రమత్తమై నీటి ట్యాంకర్‌తో మంటలు ఆర్పినట్లు పేర్కొన్నారు. కాగా మొత్తం 10 ఎకరాలలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

# ఇక నుంచి 24 గంటలూ అందుబాటులో

- త్వరలో 102 వాహనాలకు ఇద్దరు చొప్పున సిబ్బంది ఎంపిక
- ఇన్నాళ్లు సిబ్బంది కొరతతో అంతంతమాత్రంగానే సేవలు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 30 వాహనాలు
- గర్భిణులకు ఉచిత రవాణా సదుపాయం



భువనగిరి: గర్భిణుల కోసం ఏర్పాటు చేసిన 102 వాహన సేవలు ఇక నుంచి 24 గంటలూ అందుబాటులో ఉండనున్నాయి. 2017 జనవరి 17న అప్పటి ప్రభుత్వం అమ్మఒడి పథకం ద్వారా గర్భిణులకు సేవలందించేందుకు 102 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మహిళలు గర్భం దాల్చిన సమయం నుంచి ప్రసవం అయ్యే వరకు ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా ప్రతి నెల వారిని ఇంటి నుంచి సమీప ప్రభుత్వ ఆస్పత్రికి 102 వాహనంలో తీసుకెళ్లి వైద్య పరీక్షల అనంతరం తిరిగి ఇంటికి తీసుకొచ్చేవారు. ప్రస్తుతం 102 వాహనాల నిర్వహణను ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ చేపడుతోంది. ఇప్పటి వరకు సిబ్బంది కొరత వల్ల ఈ సదుపాయం అంతంతమాత్రంగానే అందుబాటులో ఉంది. కానీ ప్రస్తుతం ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ అధికారులు ఒక్కో 102 వాహనానికి ఇద్దరు చొప్పున సిబ్బందిని నియమించుకునే ప్రక్రియను చేపట్టారు. ఈ సిబ్బంది నియామకం వల్ల రాత్రి సమయంలో కూడా గర్భిణులకు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే 102 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లే అవకాశం ఉంది.

**ఉమ్మడి జిల్లాలో 30 వాహనాలు**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 102 వాహనాలు 30 వరకు ఉన్నాయి. ఇందులో నల్లగొండ జిల్లాలో 12, సూర్యాపేట జిల్లాలో 12, యాదాద్రి భువనగిరి జిల్లాలో 6 వాహనాలు ఉన్నాయి. ఒక్కో వాహనంలో ఒక డ్రైవర్ మాత్రమే ఉంటారు. వీరితో పాటు జిల్లాకు ముగ్గురు నుంచి నాలుగురు వరకు అదనంగా సిబ్బంది ఉంటారు. ఇప్పటివరకు సిబ్బంది కొరత వల్ల గర్భిణులకు 24 గంటల పాటు సేవలు అందించడానికి ఇబ్బందులు ఎదురయ్యేవి. కానీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న వాహనాలకు ఇద్దరు చొప్పున సిబ్బందిని నియామించుకోవాలని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆయా జిల్లాల్లో సిబ్బందిని ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టారు.

**ప్రతి వాహనంలో ఆక్సిజన్ సిలిండర్..**

ప్రస్తుతం ప్రతి 102 వాహనంలో 5కిలోల ఆక్సిజన్ సిలిండర్ (పోర్టబుల్)ను ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా గర్భిణులను ఆస్పత్రికి తరలించే క్రమంలో ఎలాంటి సమస్య వచ్చినా, అత్యవసరమైతే ఆక్సిజన్ సిలిండర్‌ను సద్వినియోగం చేసుకోవచ్చు. వీటితో పాటు స్ట్రెచర్‌ను సైతం ఏర్పాటు చేశారు. వాహనాలకు జియో ట్యాగింగ్ సౌకర్యం కూడా ఏర్పాటు చేసుకున్నారు.

**సిబ్బంది ఎంపిక కొనసాగుతోంది**



"ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 102 వాహనాల్లో పనిచేసే వారి సంఖ్య తక్కువగా ఉంది. సిబ్బంది కొరతల వలన 102 వాహన సేవలను రాత్రి వేళ ఎక్కువగా అందుబాటులో ఉంచలేకపోయాం. సిబ్బంది ఎంపిక కొనసాగుతుండడంతో ఇక నుంచి 24 గంటల పాటు 102 వాహన సేవలు అందుబాటులోకి రానున్నాయి.

– నసీరొద్దీన్, ఉమ్మడి జిల్లా 102 ప్రోగ్రాం మేనేజర్

# కోళ్ల పెంపకంలో ముందుజాగ్రత్తలే కీలకం



పాడి పంట

పెద్దవూర: ఏటేటా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ సారి ఏప్రిల్, మే నెలల్లోనే ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. వేడి పెరిగే కొద్ది కోళ్ల ఫాం యజమానులు, పెరటి కోళ్ల యజమానులు వాటి రక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ మాత్రం ఆలస్యం చేసినా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం లేకపోలేదు. ముఖ్యంగా వేసవిలో బద్దె పురుగు వ్యాధి ప్రబలుతుంది. ఈ వ్యాధి నుంచి కోళ్లను రక్షించుకునేందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దవూర పశువైద్యాధికారి డాక్టర్ పిట్టల చంద్రబాబు సూచించారు.

**బద్దె పురుగు నేపథ్యం..**

పరాన్న జీవులు రెండు రకాలు. అవి అంతర పరాన్న జీవులు, బాహ్యపరాన్న జీవులు. బద్దె పురుగు వంటి అంతర పరాన్న జీవులు కోళ్ల పేగుల్లో నివసిస్తూ వాటి పోషక పదార్థాలను సుష్టిగా హరించి వేస్తూ, జీవాల్లో ఉత్పాదక శక్తిని తగ్గిస్తాయి. చివరకు వాటిని బలహీనపరిచి పెరుగుదల లేకుండా చేస్తాయి. బద్దె పురుగులు తెల్లగా సన్నటి రిబ్బన్ లాంటి శరీర సౌష్టవం కల్గి ఉంటాయి.

**వ్యాధి సంక్రమించు విధానం..**

కొన్ని రకాల చీమలు, ఈగలు, మిడతలు, పేడ పురుగు, నేలపై తిరిగే నత్తలు కోడి పెంటలోని బద్దె పురుగుల గుడ్లను తినడంతో వాటి లార్వాదశ ఈ కీటకాల్లో పెరుగుతుంది. కోళ్లు ఈ కీటకాలను తిన్నప్పుడు లార్వాదశ పేగుల్లో పెరిగి బద్దె పురుగులా మారుతాయి. చిన్న వయస్సులో కోళ్లకు ఎక్కువగా ఈ బద్దె పురుగు వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వ్యాధి సోకిన కోళ్ల కాళ్లలో నిస్సత్తువ, పెరుగుదల లేకపోవడం, ఎక్కువ నీరు తాగడం, గుడ్ల ఉత్పత్తి తగ్గడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. అతి చిన్న బద్దె పురుగులు పేగు గోడలలోనికి చొచ్చుకొని పోవడంతో రక్తస్రావం కలిగి కోళ్లు చనిపోతుంటాయి. మరికొన్ని పేగులపై చిన్న చిన్న గడ్డలు ఏర్పరుస్తాయి. బద్దె పురుగులు ఎక్కువ సంఖ్యలో ఉండి పేగులలో ఆహార కదలికకు అడ్డుపడడమేకాక, వాటి ఒత్తిడితో పేగులు బద్దలై కోళ్లు చనిపోయే ప్రమాదం కూడా ఉంది. ఈ పురుగుల వలన రోగనిరోధక శక్తి తగ్గి ఇతర వ్యాధుల టీకాలు వేసినా సత్ఫలితాలు ఇవ్వకపోవచ్చు.

**రోగ నిర్ధారణ ఇలా..**

కోళ్ల గుంపులో ఎదుగుదల లేకున్నా, గుడ్ల ఉత్పత్తి తగ్గినా బద్దె పురుగు వ్యాధి ఉందని గ్రహించాలి. కోడి పెంటలో బద్దె పురుగుల శరీర ఖండాలు బియ్యపు గింజల్లాగా కనిపిస్తాయి. వ్యాధి నిర్ధారణకు ఒక కోడిని కోసి అందులోని పేగులను చూస్తే బద్దె పురుగులు కనిపిస్తాయి.

**నివారణ చర్యలు..**

ఈ వ్యాధి సోకితే కిలో బరువుగల కోడికి బ్యూటినోరెట్ 150 మిల్లి గ్రాములు, డైక్లోరోఫెన్ 200 గ్రాములు దాణాలో ఇవ్వాలి. మెబెండజోల్ పొడర్ వంద కోళ్లకు 10మి.గ్రా. చొప్పున దాణాలో ఇవ్వాలి. ఫెన్‌బెండజోల్ మరియు ప్రాజిక్వాంటాల్ వంటి ఇతర మందులను కూడా వాడవచ్చు. అలాగే కోళ్లు పెంచే ప్రాంతాలలో కీటకాలు వ్యాప్తి చెందకుండా డెల్టామెత్రిన్ అనే మందు ద్రావణాన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేకపోతే ఫినాల్, సైథియాన్ వంటి క్రిమి సంహారక మందులను నీటిలో కలిపి కోళ్ల షెడ్డు లోపల చుట్టు పక్కల పిచికారీ చేయాలి.